“నా మొహంలా వుంది” అనబోయి, మళ్ళీ ఆమె చిన్నబుచ్చుకుంటుందని “ఇంకేమైనా ప్రోగ్రెస్ వుందా” అని అడిగాడు.

“మళ్ళీ ఇంకొకసారి అగర్వాల్ దగ్గరికి ఈ రోజు వెళుతున్నాను. ఏదైనా దొరుకుతుందేమో ఆఖరసారి ప్రయత్నిస్తాను. అయినా నేనొక విషయం చెప్పనా?”

“ఏమిటి?”

“ఎక్కడో కృష్ణాపురంలో జననాలకి-- ఎప్పుడో ఒక వికృత శిశువుని కన్న ప్రతిమా అగర్వాల్‌కి సంబంధం వుండి వుండదు. మనం మరీ చీకట్లో వెతుకుతున్నామేమోనని నా అభిప్రాయం.”

“అవును మరీ ఎక్కువగా వెతకొద్దు. మీ పని అయిపోగానే బాంబే నుంచి వచ్చేయండి. దీని గురించి ఆగవద్దు.”

కసిగా ఫోన్ పెట్టేశాడు.

*　　*　　*　　*

అవతార్ బాబా దగ్గిర్నుంచి ఉస్సోక్ కార్యాలయానికి వస్తూ షాడో ఆలోచించసాగాడు. అతది మనస్సు ఇప్పుడు సగం క్లియర్‌గా వుంది. బాబా దగ్గరికి వచ్చే భక్తుల్లో సగం మంది అక్కడి వాళ్ళే అని అర్థమయ్యాక ఒక రహస్యం విడిపోయింది. ఇక ఉస్సోక్ విషయం తెలియాలి.

ఆలోచన్లతోనే ఉస్సోక్ మెట్లెక్కాడు. అతడికి ఆశ్చర్యం కలిగింది. బయటకి ఇంత నిర్జీవంగా నిర్మానుష్యంగా కనపడే ఈ భవనం యొక్క మూసివున్న తలుపుల వెనుక మొత్తం ప్రపంచాన్నే గడగడ లాడించే వ్యక్తి పుట్టుక కోసం అవిరామ కృషి జరుగుతుందని ఎవరూ కలలో కూడా వూహించలేరు.

అతడు లోపలికి వెళ్ళాడు.

అతడిని ఉస్సోక్‌లో చేర్చినప్పుడు ప్రశ్నలడిగిన వృద్ధుడు అక్కడున్నాడు- అతడి కోసమే వేచివున్నట్టు “ఏం చెప్పావా బాబాకి?” అని అడిగాడు, షాడో తలూపాడు.

“నాతోరా” అంటూ వృద్ధుడు ముందుకు సాగాడు. షాడో అతడిని అనుసరించాడు. ఇద్దరూ చిన్న హాలులో ప్రవేశించారు. హాలులో అప్పటికే ఇరవై ముప్పై మంది సభ్యులు ఆసీనులై వున్నారు. ముందు ఒక వ్యక్తి నిలబడి వున్నాడు. అతడి నీడ స్టేజిమీద పొడవుగా సాగిపోయింది. చూడగానే భయం కొలిపేలా వున్నాడు.

“అతడే మహాద్రష్ట” వెనుక వరసలో కూర్చున్నాక, నెమ్మదైన స్వరంతో అన్నాడు వృద్ధుడు. షాడో అతడినే చూస్తున్నాడు. మహాద్రష్ట చెప్పుకుపోతున్నాడు.

"అష్టావక్రుడి జన్మ గురించి అతడి తండ్రి అయిన సిద్దార్థకి ఒక సాధువు ద్వారా తెలిసింది. ఈ సాధువు స్వామి శివానంద శిష్యుడు. భిక్షాటన చేసుకుంటూ తిరిగేవాడు. అష్టావక్రుడి జననాన్ని ఆపుచేయటం కోసం శివానంద తనకు సాయం చేయగలడనే వుద్దేశ్యంతో సిద్దార్థ హిమాలయాలకు బయల్దేరాడు. అయితే స్వామి శివానందని నేను చాలా రోజుల క్రితమే చంపేశానని సిద్దార్థకీ తెలీదు. ఆ మాటకొస్తే, హిమాలయా గుహాంతర్భాగాల చీకట్లో శివానంద మరణించిన సంగతి ప్రపంచానికి తెలీదు. సిద్దార్థ తిరిగి వెనక్కి నిరాశతో తిరిగిరాక తప్పదు. రాకేష్. . . ."

వింటున్న షాడో ఉలిక్కిపడ్డాడు.

ముందు వరసలో ఒక వ్యక్తి లేచి నిలబడ్డాడు.

"నువ్వు వెంటనే బయల్దేరు. సిద్దార్థని కలుసుకో. అతను ప్రస్తుతం హరిద్వార్ నుండి హృషీకేష్ వెళ్ళే దారిలో వున్నాడు. నువ్వు చేయవలసిన పనల్లా, దగ్గిరుండి సిద్దార్థకి శివానంద ఆశ్రమం చూపించి, శివానంద మరణించిన విషయం తెలియబర్చడమే. ఆ తరువాత అతడికి మంచి మాటలు చెప్పి తిరిగి ఇక్కడకు తీసుకురా! అష్టావక్రుడి జనన సమయానికి సిద్దార్థ మరణం ఇక్కడే జరగాలి."

ముందు వరసలో వ్యక్తి తలూపాడు.

"వెంటనే బయల్దేరు."

ఆ వ్యక్తి ద్వారం దగ్గిర కొచ్చేసరికి వెలుతురు అతడిమీద పడింది. షాడో అతడిని గుర్తించాడు.

తన బావ రాకేష్!!!

షాడో దిగ్భ్రాంతుడైపోయాడు.

ఆ క్షణమే కుర్చీల మీదుగా దూక్కుంటూ వెళ్ళి అతడి ప్రాణాలు తీద్దామా అన్న ఆవేశం వచ్చింది. 'నమ్మకద్రోహి' అనుకున్నాడు. మనుష్యుల్లో రాక్షసుల్ని ప్రత్యక్షంగా చూస్తున్నాడు. ఇంతకాలం తమ మధ్య వున్న రాకేష్ ఇలాంటివాడా?

"రాకేష్" అని ఇంతలో మహాద్రష్ట అన్నాడు.

"ఒకవేళ నువ్వు సరి అయిన సమయానికి సిద్దార్థని ఇక్కడికి తీసుకురాలేకపోతే, అతడిని పర్వతాల మధ్యే చంపెయ్యి. ఇక్కడ అష్టావక్రుడు పుట్టగానే ఆ విషయం నీకు తెలియబర్చబడుతుంది. వెంటనే అక్కడ అతడిని చంపాలి. అర్థమైందా?"

రాకేష్ తలూపి బయటకు నడిచాడు.

షాడో కర్తవ్యహీనుడయ్యాడు.

తను బయటపడే సమయం ఇది కాదు.

అక్కడ సిద్దార్థ ప్రాణం అపాయంలో పడుతోంది.

మహాద్రష్ట దూరంగా స్టేజిమీద ఉపన్యాసం కొనసాగించటానికి ఆయత్తమవుతున్నాడు. ఒక్కో నిమిషం గడిచేకొద్దీ ప్రమాదం మరింత దగ్గరవుతోంది. ఇక ఏదైతే అది అయిందని షాడో లేచి నిలబడ్డాడు. మహాద్రష్ట దృష్టి అతడి మీద పడింది. ప్రశ్నార్థకంగా చూశాడు. దాంతో షాడో ముందున్న సభ్యుల తలలన్నీ వెనుదిరిగాయి.

"ఏమిటి" అని ప్రశ్నించాడు మహాద్రష్ట ఈసారి ప్రకాశంగా.

"రాకేష్‌తో కలసి నేనూ వెళతాను."

"ఎందుకు?"

షాడో గొంతు సవరించుకున్నాడు. "సిద్దార్థమీద పగ తీర్చుకోవాలని నాకెప్పటినుంచో వుంది. ఈ విధంగా అది తీరుతుంది."

"ఎందుకు నీకు పగ?"

"కేదారగౌరి నా చెల్లెలు కాబట్టి."

సభ్యులందరూ ఒక్కసారిగా తమలో తాము మాట్లాడుకోవటం ప్రారంభించటంవల్ల ఆ హాలంతా గుసగుస శబ్దంతో నిండిపోయింది! మహాద్రష్ట చెయ్యి ఎత్తాడు. సభ్యులు నిశ్శబ్దం వహించారు.

"నాకూ నా కుటుంబానికి అసలు సంబంధం లేదు. చిన్నప్పుడే నేను నా కుటుంబంనుంచి విడిపోయాను. నా తండ్రి మరణం గురించి పేపర్లో చదివి, కేవలం ఆస్థి తీసుకోవటం కోసం వచ్చాను. అప్పటికే నా చెల్లికి వివాహం అయింది. సిద్దార్థ నా ఆస్థి నాకు వప్పగించటానికి చాలా గొడవ చేశాడు-" షాడో చెప్పటం ఆపి సభ కలియచూసాడు. తరువాత అన్నాడు - "నాకు డబ్బు అంటే చాలా ఇష్టం. డబ్బుకోసం ఏదైనా చేస్తాన్నేను చివరికి చెల్లెల్నైనా చంపుతాను. ఉస్సోక్ కోసం నా ప్రాణాలనయిన వదులుకుంటాను."

మహాద్రష్ట చెయ్యి ఎత్తగానే సభ్యుల హర్షధ్వానాలు ఆగిపోయాయి.

అంతలో మహాద్రష్ట అన్నాడు. . . . "సిద్దార్థని చంపటానికి నువ్వు వెళ్ళనవసరంలేదు రవీ! సిద్దార్థ అష్టావక్రుడి జన్మ ముహూర్తానికి ఇక్కడికే వస్తాడు. తనే స్వయంగా అష్టావక్రుడి చేతుల్లో చస్తాడు."

ఇక ఆ ప్రసక్తి అక్కడితో అయిపోయినట్లు మహాద్రష్ట సభ్యుల వైపు తిరిగి సూచన్లు ఇవ్వసాగాడు--

"హరినామ్!"

రెండో వరుసలో వున్న సభ్యుడు లేచి నిలబడ్డాడు.

"అష్టావక్రుడు పుట్టే సమయం ఆసన్నమయింది. అందుకు ప్రతి బంధకంగా వున్న ఒక అడ్డుని నువ్వు తొలగించాలి."

హరినామ్ ఆజ్ఞకోసం ఎదురు చుస్తున్నాడు.

"పట్టణపు నడిబొడ్డున పెద్ద గుడి వుంది. ఆంజనేయస్వామి గుడి అది! దానిని సమూలంగా నాశనం చేయాలి! ఈ పరిధిలో ఆ దేముడి గుడి వుండడానికి వీల్లేదు. నీతోపాటు మరో నలుగురిని తీసుకువెళ్ళు. ఈ రాత్రికిగాని రేపు రాత్రికిగాని ఈ పని జరిగిపోవాలి."

హరినామ్ తలూపాడు.

వింటున్న షాడో రక్తం ఉడికిపోయింది. గుడి గురించి కాదు. గుడి ప్రాంగణంలో ఏం జరిగినా హిందువులు వూరుకోరు. వారి అనుమానం ముస్లిముల మీదకే వెళుతుంది. అందులో -- సమూలంగా!

ఇంతలో మహాద్రష్ట ఆజ్ఞ ననుసరించి మరొక నలుగురు సభ్యులు లేచి నిలబడ్డారు.

"శ్రీలంకనుంచి సమర్దనే అనే అతను మనదేశం వస్తున్నాడు. అతడి ప్రోగ్రాం ప్రకారం మద్రాసులో దిగుతాడు రేపు" - మహాద్రష్ట ఆగి చెప్పటం మొదలుపెట్టాడు-

". . . .విమానంలోంచి దిగి, బయటకు వస్తూన్న సమర్దనేని మీరు అక్కడే చంపెయ్యబోతున్నారు" అన్నాడు.

వాళ్ళు తలూపారు.

షాడోకి మతిపోయింది. ఏమిటి వీళ్ళ సాహసం అనుకున్నాదు. వర్దనే మరణంతో ఏర్పడే జాతీయ, అంతర్జాతీయ పరిణామాల గురించి ఆలోచించటం లేదు అతడు. అవి ఎలాగూ నాశనమవుతాయి. కానీ ఈ ముగ్గిరి ధైర్యం. . . . నిండు ఎయిర్‌పోర్టులో. . . . జనం మధ్యనుంచి. . . .

"మీరు ముగ్గురూ మరణిస్తారు" మహాద్రష్ట కంఠం అకస్మాత్తుగా పలికింది. ". . . . బహుశా గార్డులు అక్కడికక్కడే మిమ్మల్ని కాల్చి చంపవచ్చు. లేదా పోలీసులు నానా హింసలూ పెట్టి మీదగ్గిర్నుంచి విషయం రాబట్టటానికి ప్రయత్నించవచ్చు. కానీ మీరు సమాధానం చెప్పరు. ఉస్నోక్ కోసం మీరు ప్రాణాలు అర్పిస్తారు! మీ శవాల్ని బయటికి తీసి తిరిగి ప్రాణం పోయటానికి అష్టావక్రుడ్ని అర్థిస్తాను. ఒకవేళ అది జరగక పోయినా, వచ్చే జన్మలో ఉస్నోక్ కోసం తిరిగి జన్మించి అత్యున్నత స్థానాలు పొందుతారు మీరు."

వాళ్ళ మొహాలు అదోలాంటి క్షుద్రభక్తితో ఉప్పొంగటం చూశాడు షాడో. వాళ్ళని చూస్తూంటే అతడికి కోపం రావటం లేదు జాలేస్తూంది. ఈ మత్తులో పడిన తరువాత వారికి జ్ఞాపకం వుండేవి రెండే పదాలు. 'ఆవేశం', 'త్యాగం'!!

ఉస్సోక్ మీదా, అష్టావక్రుడి మీదా ఇంత భక్తి వున్న ఈ అనుచరులకి, చాలా జాగ్రత్తగా పోస్ట్ హిప్నాటిక్ సజెషన్స్ ఇస్తున్నాడు మహాద్రష్ట! ఆ భక్తిని కాష్ చేసుకుంటున్నాడు!! ఎయిర్‌పోర్ట్‌లో వీళ్ల ప్రాణాలు పోవటం కూడా ఖాయం! అయినా లెక్క చేయరు వాళ్ళు.

సభ్యులందరూ లేచి నిలబడటంతో సమావేశం ముగిసిందని గ్రహించాడు అప్పుడే ఆలోచన్లనుంచి తేరుకున్న షాడో.

ఒక్కరొక్కరే వెళ్ళిపోతున్నారు.

షాడో కూడా బయల్దేరాడు. చెయ్యవలసింది చాలా వుంది. ముఖ్యంగా ఆంజనేయుడి గుడి విషయం చూడాలి. రెండ్రోజుల్లో ముస్లిముల పండగ వస్తోంది రక్తపాతం జరగబోతూంది.

హాలు ఖాళీ అయ్యింది. అతడే ఆఖరివాడు. అతడు గుమ్మం దాటబోతూ వుంటే వెనుకనుంచి వినబడింది- 'షాడో' అని. అతడు ఆగాడు. స్టేజిమీద అక్కడే అదే స్థానంలో నిలబడి వున్నాడు మహాద్రష్ట. 'ఇలారా' అని పిలిచాడు. షాడోకి ఆశ్చర్యం వేసింది. అతడు తనని ఎందుకు రమ్మంటున్నాడో అర్థంకాలేదు. అయినా మాట్లాడకుండా అనుసరించాడు. ఇద్దరూ వెనుకవైపు చీకటి వరండాలో హాలువైపు నడవసాగారు.

ఆ హాల్లో వెలుతురు దేదీప్యమానంగా వుంది. చాలా విశాలమైన హాలు అది. అంత హాలులోనూ మధ్యలో ఒకే కుర్చీ వుంది. ఆ కుర్చీలో వున్న మనిషిని చూసి, షాడో అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసి, "రంజితా" అన్నాడు కంపిస్తున్న గొంతుతో.

రంజిత తలెత్తలేదు. డీప్‌షాక్‌లో వున్నట్టుంది. రక్తం తోడేసినట్టు ఆమె మొహం తెల్లగా పాలిపోయి వుంది. ఏ క్షుద్రగణాల స్వరాలయితే ఉస్సోక్ సభ్యుల అంతరంగాల్ని క్షుణ్ణంగా పరిశీలించి రహస్యాల్ని వెలికి తీస్తాయో, ఆ గణాలే ఆమెనించి రహస్యాలు రాబట్టినట్టున్నాయి.నిస్సహాయురాలిలాగా, తనతో పాటూ తన ప్రియుడినీ ప్రమాదంలో ఇరికించినందుకు కృంగిపోతూన్నట్టు ఆమె అచేతనావస్థలో వుంది.

షాడో శిలాప్రతిమలా నిలబడి వున్నాడు. వెనుకనుంచి మహాద్రష్ట కంఠం తాపీగా వినబడింది.

"రాకేష్ టేప్‌రికార్డర్ సంగతి చెప్పాడు. ఉస్సోక్ రహస్యం ఏ సభ్యుడూ బయటికి

చెప్పలేదు. కానీ మితిమీరిన అతది ఆవేశం అతదిని హద్దులు దాటించింది. రంజిత ఈ విషయాన్ని మర్చిపోయిందనీ, అందువల్లే ఆమెని చంపకుండా వదిలేసనీ రాకేష్ అన్నప్పుడే అంత సులభంగా ఆమె ఎలా మర్చిపోతుందని నాకు అనుమానం కలిగింది. రంజితని ఇక్కడికి తీసుకురమ్మని మా వాళ్ళని పంపాను. పాపం చిన్నపిల్ల గణాల పర్యవేక్షణలో రెండు నిమిషాల్లో అంతా చెప్పేసింది. ఆ తరువాత నేను సమావేశానికి వచ్చాను. అక్కడ నువ్వు అమాయకత్వం నటిస్తూ అడిగే కోర్కెల్ని చూస్తూంటే నవ్వొచ్చింది'' అంటూ నవ్వేడు.

షాడో తననితానే తిట్టుకున్నాడు. రంజిత విషయం ఎవరూ పట్టించు కోరనుకున్నాడు. ఉసోస్క్‌ని తక్కువ అంచనా వేశాడు.

ఇంతలో మహాద్రష్ట అతది దగ్గిరకి వచ్చి చేయి సాచి అన్నాడు. 'డియర్ షాడో! చేతి వాచీ ఇలా ఇస్తావా దయచేసి?' మహాద్రష్ట కంఠం కఠినంగా మారింది. ''ఉసోస్క్‌ని ఇంతవరకూ ఎవరూ మోసం చేయలేదు. మొట్టమొదటిసారి మాయం చేసిన మనిషి మీద తీసుకోవలసిన దారుణాతి దారుణమైన శిక్ష, చిత్రహింస ఎలా వుండాలో నేను ఆలోచిస్తాను. అంతవరకూ మా అతిథులుగా వుండండి.''

వాచీ పట్టుకుని మహాద్రష్ట వెళ్ళిపోయాడు. విశాలమైన హాలులో ఇద్దరే మిగిలారు.

షాడో ఆమె దగ్గరకు వెళ్ళి ''రంజితా'' అన్నాడు.

అప్పటివరకూ నిశ్శబ్దంగా వున్నదల్లా బావురుమంటూ ''ఇదంతా నా వల్లే - నా వల్లే'' అని అతది చేతుల్లో తల దాచుకుని రోదించసాగింది.

''ఊరుకో రంజితా ఊరుకో'' అని ఓదార్చసాగాడు.

హాలులో ఒక మూలగా గెలిటన్ ఆహ్వానిస్తూన్నట్టు వుంది.

రెచ్చిపోయిన క్షుద్ర మాంత్రికులు పెట్టే బాధ అనుభవించటం కన్నా ఒకేసారి దానిలో తలపెట్టి చనిపోవటం మేలు. అతడు అలా అనుకుంటున్న సమయంలో డాక్టర్ రంగప్రసాద్ ఇంట్లో టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ తీసుకుని ''హలో'' అన్నాడు.

అట్నుంచి నివేదిత కంఠం ఎగ్జయిటింగ్‌గా వినిపించింది. ''మనకొక గొప్ప క్లూ దొరికింది అనుకుంటున్నాను'' అంది.

రంగప్రసాద్ ఆసక్తిగా ముందుకు వంగి, ''ఏమిటి?'' అన్నాడు.

''అగర్వాల్ నపుంసకుడు!''

''వ్వాట్!''

''అవును ప్రతిమ డైరీలో స్పష్టంగా వుంది ఆ విషయం.''

రంగప్రసాద్ రిసీవర్ పట్టుకొని అలాగే కొంచెంసేపు వుండిపోయాడు. తరువాత తన మూర్ఖత్వానికి తనే నవ్వుకుంటున్నట్లు "ఇదేనా క్లూ" అన్నాడు.

"ఇదే."

"దీనివల్ల మనం సాధించేదేమీ లేదు. కృష్ణాపురంలో పుట్టిన ఏడుగురు శిశువుల తండ్రులూ నపుంసకులు కాదు గదా? అదీగాక భర్త నపుంసకుడైతే భార్యకి వికృత శిశువు పుడతాడని ఏ జెనెటిక్స్ శాస్త్రం లోనూ చెప్పలేదు" నిస్పృహగా అన్నాడు.

"అంతేనా?"

"అంతే నివేదితా! ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుండటం అంటే ఇదే."

"నేనింకా ఆ డైరీలు పూర్తిగా చదవలేదు. ఈ విషయం చదవగానే మీకు ఫోన్ చేసి చెప్పాలనిపించింది. సరే ఈ విషయం ఇక వదలిపెట్టండి. ఎలా వున్నారు మీరు?" ఆమె కంఠంలో స్నేహం ధ్వనించింది.

"సిక్" అన్నాడు.

"ఏం? ఎందుకని?"

"గౌరి ప్రసవకాలం చాలా దగ్గరకొచ్చింది. సిద్దార్థ, రవీ ఏమయ్యారో, ఎక్కడున్నారో తెలీదు. ఊరంతా ఎందుకో ఉద్రిక్తంగా వుంది. జనం నా వైపు దోషిని చూసినట్టు చూస్తున్నారు. సిక్ కాక మరేమిటి?"

"ఒక చిన్న గేయం చెప్పనా?"

"గేయమా? ఏమిటి?"

"మనిద్దరి మధ్యే వుండాలి సుమా!"

"ఏమిటి నివేదితా?"

"DON'T FEEL "SICK"
TAKE THE LAST LETTER
KICK THE THIRD LETTER
KEEP THE SECOND LETTER
DOUBLE THE FIRST LETTER"

"నాకేమీ అర్థం కాలేదే?"

"ఆలోచించండి అర్థమవుతుంది. ఎవరికీ చెప్పకండేం. సాయంత్రం వస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేసింది.

-----------------------

***ప్రతిమా*** అగర్వాల్ డైరీ ఆధారంగా నివేదిత తయారుచేసిన రిపోర్టు చదువుతున్నాడు రంగప్రసాద్.

"IT IS VERY DIFFICULT TO LOVE
BUT VERY EASY TO FALL IN LOVE"